ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు అంగీకార పత్రాలు అందజేత

బొంరాస్‌పేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లగచర్ల, హకీంపేట్, ఆర్‌బీ.తండా, పులిచర్లకుంట తండాల పరిధిలో ప్రభుత్వం ఇండస్ట్రీటయల్ కారిడార్ ఏర్పాటుకు ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి కావాల్సిన భూమిని రైతులు స్వచ్ఛందంగా రెవెన్యూ అధికారులకు అందిస్తున్నారు. సోమవారం 45మంది హకీంపేట్ రైతులు అంగీకార పత్రాలు అందించారు.

భర్తను బండరాయితో కొట్టి చంపిన భార్య

యాలాల మండలం ఇందిరమ్మ కాలనీలో సంఘటన

యాలాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ భర్త హత్యకు దారితీసింది. ఈ ఘటన యాలాల పోలీసుస్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం ఇందిరమ్మ కాలనీకి చెందిన మహ్మద్ ఖాజా(31), అర్షియాబేగం భార్యాభర్తలు. వీరికిద్దరు పిల్లలు. ఖాజా పాత ఇనుప సామాన్ల వ్యాపారం చేస్తున్నాడు. అయితే రెండు రోజుల నుంచి మద్యం తాగి ఇంటికి వస్తూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మహ్మద్ ఖాజా తన భార్యతో గొడవ పడ్డాడు. సోమవారం ఉదయం కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో అసహనానికి గురైన మహ్మద్ ఖాజా భార్య తన పక్కనే ఉన్న బండరాయితో భర్త తలపై బలంగా మోదింది. ఆ దెబ్బలతో మహ్మద్ ఖాజా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాలాల ఎస్‌ఐ గిరి తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపల్, కొర్రెములలో అక్రమనిర్మాణాలపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పెంట్‌హౌజ్‌లు నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొర్రెములలోని చైతన్యనగర్, ఎస్‌టీఐ పక్కన, గ్రీన్‌ఫీల్డ్ పాఠశాల పక్కన, కొర్రెముల సర్వే నెంబర్లు 747, 750లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో గోపు బాల్‌రాజ్‌యాదవ్, వంశీ, భాస్కర్, దుర్గ రాజుగౌడ్, లక్ష్మయ్య ఉన్నారు.

వంట.. ఎన్నాళ్లీ తంటా!

సర్కారు బడుల్లో కిచెన్ షెడ్లు లేక మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పథకం ప్రారంభించి ఏడేళ్లవుతున్నా చాలా పాఠశాలల్లో ఇప్పటివరకు వంట గదులు నిర్మించలేదు. కిచెన్ షెడ్లు లేక ఆరుబయట చెట్ల కింద దుమ్ము ధూళిలో వంట చేస్తూ నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. వానొస్తే వరండాలు, తరగతి గదులే దిక్కు.. కిచెన్ షెడ్లు మంజూరైనా నిర్మాణాలు పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించడం లేదు.



కీసర ఉన్నత పాఠశాలలో ఆరుబయటే వంట చేస్తున్న నిర్వాహకులు

- ఆరుబయటే మధ్యాహ్న భోజనం వంట
- వానొస్తే వరండాలు, తరగతి గదుల్లో వంటావార్పు
- కిచెన్ షెడ్లు మంజూరైనా నిర్మాణానికి నోచని వైనం
- బియ్యం, కూరగాయలు భద్రపరచడానికి అవస్థలు

కిచెన్ షెడ్లు మంజూరు	రూరల్	అర్బన్	మొత్తం
	287	86	373

రంగారెడ్డి జిల్లాలో నిర్మాణ వివరాలు

గ్రౌండ్ లెవల్ : 14, బేస్‌మెంట్ స్థాయి : 5

లెంట్ లెవల్ : 24, స్లాబ్ స్థాయి : 15

నిర్మాణం పూర్తయినవి : 45

పనులు ప్రారంభించనివి : 184

ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్ల కొరత

రంగారెడ్డి అర్బన్/వికారాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు లేని కారణంగా మధ్యాహ్న భోజనం వండటానికి నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. అనేక పాఠశాలల్లో ఆరు బయటే వంటావార్పు చేస్తున్నారు. చెట్లకింద దుమ్ముధూళిలో వంట చేస్తూ మహిళలు పడే అవస్థలు వర్ణనాతీతం. ఇక వానొస్తే వరండాలు, క్లాస్ రూములే దిక్కు. బడుల్లో గ్యాస్‌సిలిండర్లు అందుబాటులో లేక ఆరుబయట కట్టెల పొయ్యి మీదే వంట చేస్తున్నారు. దీంతో తరగతి గదుల్లోకి పొగ వెళ్లి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు కిచెన్ షెడ్లు మంజూరు చేసింది. కానీ.. అధికారుల అలసత్వంతో చాలావరకు నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో వంట చేసేందుకు నిర్వాహకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా

మిగతా 7వ పేజీలో...

వికారాబాద్ జిల్లాలో..

వికారాబాద్ జిల్లా పూడూరు, దోమ, తాండూరు మండలం మల్కాపూర్, పెద్దేముల్ ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదులు లేకపోవడంతో తరగతి గది వరండాలో వంటలు చేస్తున్నారు. తక్కువ విద్యార్థులు ఉన్నచోట, గిరిజన తండాలలో, ఇళ్లలో భోజనాన్ని వండి పాఠశాలకు తీసుకువచ్చి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. దౌల్తాబాద్‌లో కిచెన్ షెడ్డు లేని కారణంగా పురాతన షెడ్డులో వంటావార్పు చేస్తున్నారు. బషీరాబాద్‌లో 15 ఏళ్ల క్రితం చేపట్టిన కిచెన్ షెడ్డు నిర్మాణం ఇప్పటి వరకు పూర్తి కాలేదు.

ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజావాణి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. బాధితుల నుంచి 118 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి, ఇతర సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని, స్వీకరించిన వాటిలో కొన్నింటిని సత్వరమే పరిష్కరించామన్నారు. వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపిం వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: డీఆర్‌ఓ హరిప్రియ

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని డీఆర్‌ఓ. హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతిలు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వారు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి అందించే ఫిర్యాదులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో 76 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి

కొడుకుపై తండ్రి హత్యాయత్నం

- » తనను వదిలి వెళ్లిన భార్య తిరిగి వస్తుందని ఘాతుకం
- » బాలుడి అరుపులు విని కాపాడిన పొరుగింటి వారు
- » కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో స్థానికుల ఫిర్యాదు



పోలీసుల అదుపులో హన్మంతు

తాండూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కన్నకొడుకును కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కాలయముడయ్యాడు. కొడుకును హతమార్చేందుకు యత్నించాడు. కొడుకును చంపితే తనను వదిలి వెళ్లిన భార్య తిరిగి వస్తుందని ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తాండూరు మండలం మల్కాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి 8.30గంటలకు వెలుగులోకి వచ్చింది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్ర సేడం తాలూకా మల్కేడ్ గ్రామానికి చెందిన హన్మంతు తాండూరు మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన శరణమ్మను 17ఏళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. అయితే వీరు మల్కాపూర్‌కు ఐదేళ్ల కిందట వలస వచ్చి నాపరాతి గనుల్లో కట్టర్‌గా పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమారులు. వారు అరవింద్, ధర్మ, కార్తీక్. ఇటీవల భార్య శరణమ్మతో హన్మంతు తరచూ గొడవలు పడుతూ ఉండేవాడు. దీంతో శరణమ్మ రెండు నెలల కిందట బీదర్‌లో ఉంటున్న తన అక్క నర్సమ్మ వద్దకు వెళ్లింది. తనతో పాటు తన రెండో కుమారుడు కార్తీక్‌ను వెంట తీసుకెళ్లింది. పెద్ద కుమారుడు అరవింద్(14)ను మాత్రం భర్త వద్దనే వదిలేసి వెళ్లింది. అరవింద్ మల్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటున్నాడు. మల్కాపూర్‌లో ఉంటున్న శరణమ్మ అన్న నాగప్ప అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల కోసం శరణమ్మ మల్కాపూర్‌కు వచ్చింది. అంత్యక్రియల అనంతరం సాయంత్రం తిరిగి వెళుతుండగా, హన్మంతు ఆమె వద్దకు వెళ్లి మాట్లాడే ప్రయత్నం చేశాడు. శరణమ్మ మాట్లాడకపోవడంతో కోపోద్రిక్తుడయ్యాడు. దీంతో రాత్రి 8గంటల సమయంలో హన్మంతు మద్యం సేవించి తన వద్ద ఉంటున్న పెద్ద కుమారుడు అరవింద్‌పై కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేశాడు. అరవింద్ అరుపులు, కేకలు వేయడంతో పక్కింటి వారు వచ్చి తలుపులు పగలగొట్టి అరవింద్‌ను కాపాడారు. అప్పటికే అరవింద్ గొంతు, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కరన్‌కోట్ పోలీసులకు సమాచారం అందించారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థి అరవింద్‌ను చికిత్స నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు నిందితుడు హన్మంతును అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరిచామని ఎస్‌ఐ తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారని స్థానికులు వెల్లడించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

వికారాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని టీఎస్ఎస్‌యూఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు కేతావత్ గాంగ్యానాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంగ్యానాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. లేకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి సంవత్సరం దాటినా ఇంతవరకు హామీ నెరవేర్చలేదన్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మెసెంజర్ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం, యంఐఎస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా సమగ్ర శిక్ష, కేజీబీవీ ఎస్‌వోలు ప్రభావతి, స్వరూప, స్రవంతి, ఆశాలత, మంగమ్మ, శైలజ, స్రవంతి, రాజేశ్వరి, పీటీఐలు అనిల్, జంగయ్య, రాఘవేందర్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు



నాపరాతి గని భూమిలో మైన్స్ అధికారుల సర్వే

- » పోలీసుల బందోబస్తు
- » పర్యవేక్షించిన మైన్స్ ఏడీ సత్యనారాయణ

తాండూరు రూరల్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : తాండూరు మండలం ఓగీపూర్ గ్రామ శివారులోని వివాదాస్పద నాపరాతి గని భూమిలో మైన్స్ సర్వే అధికారులు సర్వే నిర్వహించారు. సోమవారం సర్వేను తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ పర్యవేక్షించారు. ఓగీపూర్ గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 65లో మొత్తం 12 ఎకరాల 29గుంటల భూమి ఉంది. దానిలో బసంతరావు పటేల్‌కు రెండెకరాల 14గుంటలు, ఎం.వెంకట్రామిరెడ్డికి ఎకరం 15గుంటల భూమి ఉంది. అయితే, ఇక్కడ ఒకరి భూమిలో ఒకరు తవ్వకాలు జరిపారన్నది వీరి మధ్య సాగుతున్న వివాదం. ఈ వ్యవహారంపై వెంకట్రామిరెడ్డి ఇటీవల రాష్ట్ర మైన్స్ డైరెక్టర్, రెవెన్యూ, జిల్లా కలెక్టర్, మైన్స్ ఏడీలకు ఫిర్యాదు చేశారు. దీంతో మైన్స్ ఏడీ సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ నాగలక్ష్మీ, సర్వేయర్ లక్ష్మీకాంత్ బృందం పోలీసుల సమక్షంలో మరోమారు సర్వే నిర్వహించారు. అయితే ఈ సర్వే నెంబర్ 65 మైన్స్ శాఖ పరిధిలోకి రావడంతో రికగ్నైజ్డ్ సంస్థ అయిన ఎట్నానాల్ ద్వారా సర్వే నిర్వహించడం జరిగిందని, మైన్స్ సర్వేయర్ లక్ష్మీకాంతం తెలిపారు. బసంతరావు పటేల్, ఎం.వెంకట్రామిరెడ్డి సమక్షంలో సర్వే నిర్వహించామని తెలిపారు. ఈ సర్వేకు సంబంధించిన సమగ్ర వివరాలను పూర్తిస్థాయిలో క్రోడీకరించి ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

షాప్ ఒకరిది.. నిర్వహణ మరొకరిది

- » మెడికల్ షాపుల ఏర్పాటులో నిబంధనలు గాలికి
- » పట్టించుకోని అధికారులు
- » మూడుచింతలపల్లిలో జోరుగా మెడికల్ దందా



మూడుచింతలపల్లి, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపుల నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. మూడుచింతలపల్లి మండలంలో కనీస విద్యార్హతలు లేని వారు కూడా మెడికల్ దందా నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిని రెగ్యులర్‌గా తనిఖీ చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మెడికల్ షాపు నిర్వహించాలంటే నిబంధనల ప్రకారం ఫార్మసిస్టు తప్పకుండా షాపులో ఉండాలి. కానీ, చాలా దుకాణాల్లో ఫార్మసిస్టులే లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. కొందరు వ్యాపారులు ఇతరుల సర్టిఫికెట్లను అద్దెకు తీసుకొని వారి పేరుతో దుకాణాలు నడుపుతున్నారు. మందులపై కనీస జ్ఞానం లేని వారు దుకాణాల్లో మందులు అమ్ముతూ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వ్యాపారాలు సాగిస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. ఏదైనా ఘటన జరిగినప్పుడు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారు తప్ప తర్వాత వాటి గురించి పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

ప్రిస్కిప్షన్ లేకుండానే అమ్మకాలు..

మెడికల్ షాపులో ఫార్మసిస్టు లేకుండానే మందుల విక్రయాలు జరుపుతున్నారు. వాస్తవానికి డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్మకూడదు. కానీ, ఇక్కడ ఎవరూ ఆ నిబంధనను పాటించడం లేదు. కనీస విద్యార్హత లేని వారు ఇలా నేరుగా మెడిసన్స్ అమ్మడం వల్ల నష్టం జరిగే ప్రమాదముంటుందని తెలిసినా మెడికల్ షాపుల నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. దీనికి తోడు ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకున్న కొందరు మెడికల్ షాపు నిర్వాహకులు వారే వైద్యుల అవతారమెత్తి ప్రజలకు సలహాలిస్తూ అడ్డగోలుగా మందులు అంటగడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అడ్డదారిలో అనుమతులు తీసుకొని..

మెడికల్ షాపు నిర్వాహకులు మెడికల్ షాపు అనుమతులు ఒకరి పేరు మీద తీసుకొని మరొకరు నిర్వహిస్తున్నారు. కొంతమంది సంబంధం లేకుండానే అడ్డదారిలో అనుమతులు సర్టిఫికెట్లు అద్దెకు తీసుకొని మెడికల్ దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఔషధ నియంత్రణ విభాగ అధికారుల నిఘా కొరవడంతో పుట్టగొడుగులా మెడికల్ షాపులు పుట్టుకొస్తున్నాయి. ఇటీవల కొన్నిసార్లు మెడికల్ షాపులపై తనిఖీలు చేసినా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకోకపోవడం కొసమెరుపు.

మా దృష్టికి రాలేదు

మెడికల్ షాపు నిర్వాహకులపై మాకు ఎలాంటి ఫిర్యాదూ రాలేదు. నిబంధనలు పాటించకుండా మెడికల్ షాపులను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం..


- ప్రవీణ్, డ్రగ్ ఇన్స్పెక్టర్, మేడ్చల్

రావులపల్లి మాజీ సర్పంచ్‌కు అవార్డు



చేవెళ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధి రావులపల్లి మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్‌కు బహుజన సాహిత్య అకాడమీ ఉత్తమ సర్పంచ్ అవార్డు ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లో బహుజన సాహిత్య అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ ప్రశంసా ప్రత్రాన్ని శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ నెల 15న ఢిల్లీలో జరిగే 17వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో శ్రీనివాస్‌కు అవార్డు అందుకుంటారని చెప్పారు.







రైల్వే వంతెనపై డ్రామాలు మానుకోవాలి



ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన వద్ద పర్యటిస్తున్న సుధీర్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్

ఘట్‌కేసర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ రైల్వేవంతెన నిర్మాణం విషయంలో కొందరు నాయకులు డ్రామాలు చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. వారు ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెన నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి మంత్రిగా పనిచేసి ఎక్కడి పనులను అక్కడే వదిలేసి చోద్యం చూసిన స్థానిక ఎమ్మెల్యే తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి కేవలం ఏడాదే అవుతున్నదన్నారు. ఏప్రిల్ వరకు వంతెన నిర్మాణ పనులను పూర్తి చేస్తానని కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఇంతలోనే కొందరు దీక్షపేరుతో డ్రామాలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. నాలుగు నెలల్లో పూర్తి చేసేందుకు అన్నిచర్యలు చేపట్టినట్లు వివరించారు. దీక్షల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కాని పనులు కేవలం ఆరు నెలల్లోనే పూర్తి చేయాలనడం రాజకీయ అక్కసు కాదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలను రెచ్చగొట్టి ఇబ్బందులు పెట్టడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.







ఉల్లి తగ్గదు.. వెల్లుల్లి దిగదు

- వెల్లుల్లి కిలో ధర రూ. 400
- ఉల్లి ధర రూ.50పైమాటే



తాండూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ రెండు లేకుంటే వంటలు రుచికరంగా ఉండవు. అన్ని కూరల్లో, అన్ని రకాల వంటల్లో వాడే ఉల్లిగడ్డ, వెల్లుల్లి (ఎల్లిగడ్డ) ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో అమాంతం పెరిగాయి. ధరలు చూసి ఎలా కొనుగోలు చేయాలంటూ సామాన్యులు వాపోతున్నారు.

తగ్గని ఉల్లి ధర..

కొన్ని నెలలుగా ఉల్లి ధర తగ్గడంలేదు. రిటైల్ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50పైమాటే. సాధారణంగా వర్షాకాలం ఎక్కువ ధర ఉండే ఉల్లి ప్రస్తుతం శీతాకాలంలోనూ ధర తగ్గుముఖం పట్టడంలేదు. ధర తగ్గాక కొనుగోలు చేద్దామనుకుంటున్న వారికి నిరాశే మిగులుతోంది. గత్యంతరం లేక తక్కువ మోతాదులో ఉల్లిని కొనుగోలు చేస్తున్నారు. నవంబరు నెలలో సాధారణంగా కిలో ఉల్లి ధర రూ.15 నుంచి రూ.20గా ఉంది. అయితే ప్రస్తుతం రెండింతలు పెరిగింది. గడిచిన ఆరునెలలుగా ఉల్లి ధర పెరుగుతూనే ఉంది. సాధారణ పౌరుడు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఉల్లిధర కన్నీళ్లు తెప్పిస్తోంది.

వెల్లుల్లిదీ అదేదారి..

వెల్లుల్లి (ఎల్లిగడ్డ) సంగతి చెప్పనక్కర్లేదు. సామాన్యుడు కొనుగోలు చేయలేని స్థాయికి ధర పెరిగిపోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో వెల్లుల్లి కిలో.400 పలుకుతోంది. పావుకేజీ రూ.100 ఉంది. స్థానికంగా పండించక పోవడం, దిగుమతిపై ఆధారపడటమే ధరలు తగ్గకపోవడానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. తాండూరు మార్కెట్‌కు ఉల్లిగడ్డ మహారాష్ట్ర నుంచి, వెల్లుల్లి గుజరాత్ నుంచి దిగుమతి అవుతుంది. దీంతో ధరలపై ప్రభావం చూపుతోంది.

తెలంగాణ ఉద్యమనేత తాండ్ర వీరేందర్‌రెడ్డి మృతి



తాండ్ర వీరేందర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కేశంపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమ నేత, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తాండ్ర వీరేందర్‌రెడ్డి(85) అనారోగ్యంతో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందారు. కేశంపేట మండలం పాపిరెడ్డిగూడకు చెందిన వీరేందర్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. గ్రామ సర్పంచ్‌గా 20ఏండ్లు సేవలందించారు. విద్యాభివృద్ధికి కృషిచేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరటం చేసిన ఆయన నియోజనవర్గంలో స్పాంజ్ అండ్ ఐరన్ పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా హైకోర్టులో పిల్ వేసి గెలిచారు. ఇటివలే ఈ తీర్పు వెలువడింది. షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాదుల సమస్యలను పరిష్కరించారు. వీరేందర్ రెడ్డి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందతూ మృతి చెందాడు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య, ప్రతాప్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌చారి, ఏఎంపీ వైస్‌చైర్మన్ బాబర్ ఖాన్, రామకృష్ణారెడ్డి, వంకాయల నారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు వీరేందర్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఆయన కుమారుడు శ్రవణ్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి చేశారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాలాలు, ప్రభుత్వ భూములను అక్రమించి చేపడుతున్న నిర్మాణలపై చర్యలు తీసుకోవాలని పోచారం మున్సిపల్ వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కౌన్సిలర్ చింతల రాజశేఖర్ మేడ్చల్ కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కు సోమవారం వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. పోచారంలోని సర్వేనెంబర్ 27లోని ప్రభుత్వ స్థలంలో నాలాలను పూడ్చి రాంకీసంస్థ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా యంనంపేట్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 92, 93, 94, 95, 123/పి, 124/పినుండి బొంతకుంట వాగు వరకు ఉన్న నాలాను పూర్తిగా మూసివేసి దాని స్థానంలో 40అడుగుల రోడ్డును నిర్మిస్తున్నారని తెలిపారు. యంనంపేట్‌లోని సర్వేనెంబర్ 90పార్టులో పార్కుస్థలాన్ని అక్రమించి రియల్ వ్యాపారులు రోడ్డు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రెడ్డియా నాయక్, రాజశేఖర్‌లు ఉన్నతాధికారులను కోరారు.

విద్యుత్ అధికారులకు సన్మానం



నూతన అధికారులను సన్మానిస్తున్న రైతు సంఘం నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల కో-ఆర్డినేటర్ తిప్పని పెంటారెడ్డి కోరారు. సోమవారం సంఘ్ ఆధ్వర్యంలో చేవెళ్లలో ట్రాన్స్‌కో ఏడీఏ రాజేష్ బాబు, ఏఈ రాజేందర్‌లను సన్మానించారు. వారు మాట్లాడుతూ.. సాగు కోసం వేసిన విద్యుత్ లైన్లలో ఇబ్బందులను తీర్చాలని కోరారు. ఓవర్ లోడ్ ఉన్న ప్రాంతాల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్లు పాతబడిన చోట కొత్తగా వేస్తూ కిందికి వేలాడుతున్న వైర్లను లాగి అదనంగా పోళ్లు వేయాలని విన్నవించారు. ఏడీఏ స్పందిస్తూ.. విద్యుత్ పంపిణలో తలత్తే సమస్యలను తమ దృష్టికితెస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కార్యదర్శులకు టార్గెట్‌లు విధించొద్దు



ఇన్‌చార్జి ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న పంచాయితీ కార్యదర్శులు

శంకర్‌పల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేయొద్దని కార్యదర్శులు ఎల్లయ్య, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్, రియాజుద్దీన్ అన్నారు. ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో టార్గెట్‌లు విధించకుండా, పనిలో సెలవుదినాలను మినహాయించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో గిరిరాజ్‌కు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఇళ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి భాద్యత పంచాయతీ కార్యదర్శులకు అప్పగించొద్దన్నారు. తామే కేటాయిస్తే గ్రామస్తులతో ఇబ్బందులెదురయ్యే ఆస్కారం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అప్పగించిన పనిచేస్తామని, టార్గెట్‌లు, పనిఒత్తిడి పెట్టొద్దని కోరారు. కార్యక్రమంలో పీఎస్‌లు నరహరి, వసంత, ప్రమీల, హరికృష్ణ ఉన్నారు.

రాజమండ్రి నృత్య ప్రదర్శనలో వికారాబాద్ విద్యార్థులు

వికారాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో నిర్వహించిన నృతప్రదర్శన పోటీల్లో వికారాబాద్ బాల కేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు. 7, 8వ తేదీల్లో కొనసాగిన ఈ పోటీల్లో వికారాబాద్ విద్యార్థులు బాల కేంద్రం నృత్య శిక్షకురాలు అనురాధ నేతృత్వంలో పాల్గొని ప్రతిభను కనబర్చారు. వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ నృత్యప్రదర్శనలో వికారాబాద్ విద్యార్థులు భవ్యప్రియ, వైష్ణవి, పూర్ణచంద్ర, నిత్య, సాయి వినూత్న, సహజ, సాన్వి పాల్గొన్నారు.



రాజమండ్రి నృత్య ప్రదర్శనలో వికారాబాద్ విద్యార్థులు

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- 12 నుంచి శ్రీ లక్ష్మీవేంటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలు
- ఆరు రోజుల పాటు నిర్వహణ
- 14న తిరు కల్యాణం, 15న రథోత్సవం



లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం, స్వామివార్ల మూలవిరాట్

తలకొండపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న తలకొండపల్లి మండలం రాంపూర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ దేవాలయంలో ప్రతి ఏటా వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. చరిత్ర కలిగిన ఈ దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తారు. ఆరు రోజుల పాటు ఇక్కడ జాతర ఘనంగా కొనసాగుతోంది. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి స్నేహలత, చైర్మన్ జిల్లెల్ల పవన్ కుమార్ రెడ్డి వివరించారు. 12న అంకురారోహణం, 13న ధ్వజారోహణం, 14న తిరుకల్యాణం, అన్నదానం, 15న భజన పోటీలు, రథోత్సవం, 16న దోపోత్సవం, బండ్లు తిరుగుట 17న చక్రతీర్థం, గరుడ సేవ, నాగబలి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా 13న నిర్వహించే భజన పోటీలలో విజేతలకు మొదటి బహుమతి, రూ.10,116, రెండో బహుమతి రూ.5116, మూడో బహుమతి రూ.2516 అందజేయడం జరుగుతుందని తెలిపారు.

అంతర్జాతీయ కరాటే పోటీలలో ఆమనగల్లు విద్యార్థినుల ప్రతిభ



ఆమనగల్లు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కరాటే పోటీలలో ఆమనగల్లు పట్టణానికి చెందిన సోను కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. చాంపియన్ షిప్‌తో పాటు గోల్డ్ మెడల్ సాధించారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో సోమవారం అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఆమనగల్లు సోను అకాడమీ నుంచి 14 మంది విద్యార్థినులు ఈ పోటీలలో పాల్గొన్నారు. అందులో 11 మంది బంగారు, ముగ్గురు సిల్వర్ మెడల్స్ సాధించారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. పతకాలు సాధించిన ప్రణవి, దీక్షిత, స్రవంతి, పింకి, అరుణ, ఆస్మిక, హిందు, పల్లవి, గాయత్రి, నిహారిక, జస్విక, వైశాలి, అశ్వినిలను పలువురు సత్కరించి అభినందించారు.

తీగాపూర్‌లో ఆలయ ప్రతిష్ఠ వేడుకలు



కొత్తూర్, డిసెంబరు 9:(ఆంధ్రజ్యోతి): తీగాపూర్ నిర్మించిన సీతారామచంద్ర, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠా వేడకలో భాగంగా మొదటి రోజు సోమవారం జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామిజీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పరమానందస్వామి ఆశ్రమ పీఠాధిపతులు లక్ష్మీనారాయణ మళయాళస్వామి, వైదిక పురోహితులు, చండిఉపాసకులు రేవల్లి రాజుశర్మ హాజరై పూజల్లో పాల్గొన్నారు. జలాధివాస కార్యక్రమంలో మహిళలు బిందెలతో నీటిని తెచ్చి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బి.జగన్మోహన్‌రెడ్డి, నాయకులు రమాదేవిరమేష్, చిర్ర మల్లయ్య, గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, మెండె కృష్ణ, గోపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభులింగం పాల్గొన్నారు.

వంట.. ఎన్నాళ్లీ తంటా!

(5వ పేజీ తరువాయి)

విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి మంజూరైన కిచెన్ షెడ్ల నిర్మాణాలను పూర్తి చేయడమే కాకుండా గ్యాస్ సౌకర్యం కల్పించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులు కోరుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో 27 మండలాల్లో మొత్తం 1,309 పాఠశాలలున్నాయి. అందులో ప్రాథమిక పాఠశాలలు 882, ప్రాథమికోన్నత పాఠశాలలు 179, ఉన్న పాఠశాలలు 248 ఉన్నాయి. జిల్లాలో 735 పాఠశాలల్లో కిచెన్ షెడ్లు అందుబాటులో ఉన్నాయి. మిగితా పాఠశాలలకు కిచెన్ షెడ్లు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం (2018-19) గ్రామీణ ప్రాంతంలో 287 కిచెన్ షెడ్లు మంజూరు చేసింది. వీటి నిర్మాణాలు డీఆర్‌డీఏకు అప్పగించారు. అర్బన్ ప్రాంతాల్లో 86 కిచెన్ షెడ్లు మంజూరు చేయగా వీటి నిర్మాణాలను అర్బన్ ఏరియా టీఎస్‌ఈడబ్ల్యుఐడీసీకి అప్పగించారు. గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన 287 కిచెన్ షెడ్లకు గాను ఇప్పటి వరకు కేవలం 14 మాత్రమే గ్రౌండ్ లెవల్‌కు చేరుకున్నాయి. ఐదు కిచెన్ షెడ్లు బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. 24 కిచెన్ షెడ్లు లెంటల్ లెవల్‌కు చేరుకోగా, 15 షెడ్లు స్లాబ్ స్థాయిలో ఉన్నాయి. మొత్తం 45 కిచెన్ షెడ్లు మాత్రమే పూర్తయ్యాయి. 184 కిచెన్ షెడ్లు నిర్మాణ పనులు ఇప్పటి వరకు ప్రారంభించనే లేదు. అర్బన్ ప్రాంతాల్లో మంజూరైన 86 కిచెన్ షెడ్ల నిర్మాణాల్లో కొన్నింటిని పూర్తి చేయగా అత్యధికంగా నిర్మాణాలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. కేశంపేట మండల పరిధిలోని జడ్పీహెచ్ఎస్‌లో ప్రత్యేక వంట గది లేకపోవడం వల్ల పాఠశాల వెనుక భాగంలో ఉన్న ఇరుకైన గదిలో వంట చేస్తున్నారు. ఆరుబయట వంటతో ఇబ్బందులు పడుతున్నారు. చౌదరిగూడ, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. శంకర్‌పల్లి మండలం ఎర్వగూడ పాఠశాలలో సిలిండర్ లేక పోవడంతో కట్టెల పొయ్యిపైనే భోజనం వండి పెడుతున్నారు. మహేశ్వరం మండలం తుమ్మలూరు బడిలో గ్యాస్ సిలిండర్‌కు ఖర్చు ఎక్కువవుతుందని కట్టెల పొయ్యిమీదే వంట చేస్తున్నారు. మంచాల జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో కిచెన్‌లో సరిపడా స్థలం లేక కట్టెలు సైతం అందులోనే నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి ఉంది. కిచెన్ పైకప్పు శిథిలావస్థకు చేరి వర్షం పడితే కురిసి వంట సామగ్రి తడిసి పోతుంది.



కొందుర్గు వరండాలో మధ్యాహ్న భోజనం వంట

రంగారెడ్డి జిల్లాలోని పాఠశాలల వివరాలు

మండలాలు	27
ప్రాథమిక	882
ప్రాథమికోన్నత	179
ఉన్నత	248
మొత్తం	1,309

కిచెన్ షెడ్ ఇరుకుగా ఉంది..



కిచెన్ షెడ్ ఇరుకుగా ఉంది. వర్షానికి కట్టెలు తడుస్తాయని ఉన్నదాంట్లోనే వాటిని పెట్టాల్సి వస్తుంది. గ్యాస్ సరఫరా చేస్తే కట్టెల పొయ్యి బాధ తప్పుతుంది. మా మండలంలో చాలా పాఠశాలల్లో కిచెన్ షెడ్లు లేక మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు.

- చోటుమియా, వంట కార్మికుడు, చౌదరిగూడ

మార్కెట్ ప్రధాన రోడ్డు ఆక్రమణల తొలగింపు

- మున్సిపల్ అధికారులతో భవన యజమానుల వాగ్వాదం



నిర్మాణాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని మార్కెట్ ప్రధాన రోడ్డు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. ఆక్రమణలు తొలగించే సమయంలో పలువురు దుకాణాల యజమానులు మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆక్రమణలు చేసిన వారిని వదిలేసి సెట్‌బ్యాక్‌తో నిర్మించుకున్న వారి కట్టడాలను తొలగించటంపట్ల కొందరు యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ సిబ్బందిని అడ్డుకోవడంతో స్వల్పంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

రైల్వేస్టేషన్ వెళ్లే రోడ్డు మూసివేత

మేడ్చల్ హౌజింగ్‌బోర్డు కాలనీ డ్రైనేజీ నిర్మాణపనుల్లో భాగంగా మున్సిపల్ అధికారులు జాతీయ రహదారి వివేకానంద చౌరస్తా నుంచి హౌజింగ్‌బోర్డు మీదుగా రైల్వేస్టేషన్ వెళ్లే రోడ్డును సోమవారం మూసివేశారు. రైల్వే స్టేషన్ వెళ్లాల్సిన వాహనాలను వివేకానంద చౌరస్తా నుంచి ప్రధాన మార్కెట్ పాత జాతీయ రహదారి మీదుగా మహవీర్ చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్‌కు చేరుకునే వీలుకల్పించారు. ఇందులో భాగంగా పోలీసులు, మున్సిపల్ అధికారులు ప్రధాన మార్కెట్ రోడ్డుపై ప్రయాణించే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు విస్తరణ చేపట్టి దుకాణాల ముందు ఏర్పాటు చేసుకున్న ఆక్రమణలు తొలగించారు. మార్కెట్‌లోని కొందరు భవనాల యజమానులు రోడ్డుకు ఆనుకుని మెట్లపై అంతస్తులకు సంబంధించిన ఐరన్ మెట్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటితో పాటు రోడ్డుపై వాహనాల రాక పోకలకు ఆటంకాలు కల్పించేలా బోర్డులు, వాహనాల పార్కింగ్ షెడ్‌లను ఏర్పాటు చేసుకోగా మున్సిపల్ సిబ్బంది వాటిని తొలగించారు. రోడ్డుపై వాహనాల రాకపోకలకు అడ్డంకులు కల్పిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.

39వ రోజుకు చేరిన రిలే దీక్షలు



దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండలంగా ఏర్పాటు కోసం గ్రామస్థులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారంతో 39వ రోజుకు చేరాయి. గ్రామంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. 9పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని ప్రభుత్వం మండలం చేయాలని జేఏసీ నాయకులు కోరారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ విషయంలో చొరవతీసుకోవాలన్నారు. దీక్షలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్‌లు శరత్‌చంద్ర, అంజనేయులు, నాయకులు బాలయ్య, రామచంద్రయ్య, చెన్నయ్య, కృష్ణయ్య, బాలయ్య, శేఖర్, అల్లావుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ పనులను ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

చౌదరిగూడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను ప్రారంభించి వ్యవసాయానికి నీరందించాలని తెలంగాణ ఉద్యమకారుడు రామన్న మాదిగ అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మిత ప్రాంతాన్ని ఉద్యమకారులు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించారు. వారు మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. తాగునీటి సమస్యా తీరుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాసిగా పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ పనులను ఎందుకు ప్రారంభించడం ప్రశ్నించారు. ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం చేపట్టే ఏ కార్యక్రమానికైనా తెలంగాణ ఉద్యమ వేదిక మద్దతిస్తుందన్నారు. గత పదేళ్లలో ఉద్యమకారులకు సరైన ఆదరణ లేకుండా పోయిందని, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉద్యమకారుల పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సునిల్, నరింహులు, సాయన్న, శ్రీను, రాములు, వెంకటయ్య, భీంచంద్రం, మొగులయ్య, రాధాకృష్ణ, మహిళలు, వెంకటమ్మ, యాదమ్మ, భీమమ్మ, సత్యమ్మ, ఎల్లమ్మ, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



ధాన్యం విక్రయాలను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ వై.గీతనర్సింహ

ఆమనగల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ అన్నారు. వర్షాలొస్తే ధాన్యం తడవకుండ కప్పేందుకు రైతులకు టార్పాలిన్లు ఇవ్వాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు కేంద్రాన్ని సోమవారం గీత సందర్శించారు. రైతులతో మాట్లాడారు. తుకాలు సకాలంలో వేయక ఇబ్బందులు పడుతున్నామని, వానొస్తే వడ్లు తడుస్తాయని రైతులు అన్నారు. ఎండ కొట్టనందుకు వల్లు వడ్లు ఎండడం లేదని, తేమ శాతం విషయంలో సడలింపునివ్వాలని రైతులు గీతను కోరారు. రైతుల ఇబ్బందులు తీర్చాలని మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజేశ్వరికి ఆమె సూచించారు. కార్యక్రమంలో కర్నాటి శ్రీధర్‌రెడ్డి, షాబుద్దీన్, కండె సాయి, ఏఈవోలు, మార్కెట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మా భూములను ఇతరులకు పట్టా ఎలా చేశారు?

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట అగర్‌మియాగూడ రైతుల ఆందోళన



కందుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అగర్‌మియాగూడ రైతులు

కందుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మా భూములను ఇతరులకు ఎలా పట్టా చేశారని రంగారెడ్డి జిల్లా అగర్‌మియాగూడ గ్రామ రైతులు సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. న్యాయం చేయాలని కొందరు రైతులు ఒంటిపై పెట్రోల్ పోసుకోవడానికి ప్రయత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కందుకూరు మండలంలోని లేమూరు రెవెన్యూ పరిధిలోని 246 లో 19ఎకరాల 10గుంటల భూమిని 50ఏళ్ల క్రితం ఉస్మాన్ మోహినుద్దీన్ వద్ద రైతులు భూమిని కొనుగోలు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు పొందారు. అప్పటి నుంచి ఆ భూమిని సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కానీ ఈ భూమి మాదని చిన్నగళ్ల రామయ్య, ఆయన కుమారులు రక్షిత కౌలుదారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వివాదంపై న్యాయస్థానంలో కేసు నడుస్తుండగానే ఈ భూమి కొనుగోలు చేసిన రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కందుకూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి కౌలుదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. ఇలా ఎలా ఇస్తారని రైతులు ఆందోళనకు దిగారు. భూములు కోల్పోయి మేం ఎలా బతకాలని ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో ఎస్‌ఐ సైదులు తమ సిబ్బందితో వారిని అదుపులోకి తీసుకొని శాంతింపజేశారు. ఈ భూములు మావేనంటూ రైతులు అంతకు ముందు ఆర్డీవో కార్యాలయంలో కూడా దరఖాస్తు చేశారు. ధరణి పోర్టల్‌లో ఒరిజినల్ ఎంట్రీలను పునరుద్ధరించాలంటూ రైతులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ వైస్‌గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి

కడ్తాల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని లయన్స్‌క్లబ్ జిల్లా వైస్‌గవర్నర్ మహేంద్రకుమార్ రెడ్డి, మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. కడ్తాల బస్టాండ్ వద్ద సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ దామోదర్‌రెడ్డి కూతురు ప్రార్థనరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.నర్సింహ, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్‌లతో మహేంద్రకుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పి.లక్ష్మారెడ్డి, సభ్యులు అంజయ్య పాష, మిట్టపల్లి అంజయ్య, గంప శ్రీను, జూలూరి రమేశ్, మహేశ్, కుమార్‌గౌడ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండో అంతస్తు నుంచి పడి విద్యార్థినికి గాయాలు

- ఎస్టీ బాలికల హాస్టల్‌లో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి



ఉస్మానియాలో చికిత్స పొందుతున్న పూజ

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్ రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు ఓ విద్యార్థిని పడి తీవ్ర గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని హాజీపల్లి రోడ్డులో ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహం ఉంది. శుక్రవారం రాత్రి పూజ అనే డిగ్రీ ఫైనలియర్ విద్యార్థిని ప్రమాదవశత్తు రెండో అంతస్తు నుంచి పడిపోయింది. ప్రమాదంలో విద్యార్థిని కాళ్లు విరిగాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని కోలుకుంటోందని, ప్రాణాపాయం లేదని ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా ఆస్పత్రిలో విద్యార్థినిని ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆకాశ్‌నాయక్ సోమవారం పరామర్శించారు. ఆమెకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను, హాస్టల్ నిర్వాహకులను కోరారు.

ఇంపాక్ట్ సమ్మిట్‌కు వెళ్లిన సుంకిరెడ్డి



యువ ఆవిష్కర్తలతో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జరుగుతున్న 8వ యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు తెలంగాణ ప్రభుత్వం తరపున టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సోమవారం బయలుదేరి వెళ్లారు. తెలంగాణకు చెందిన ఐదుగురు యువ ఆవిష్కర్తల బృందంతో సుంకిరెడ్డి శంషాబాద్ ఎయిర్‌పోర్టు బయల్దేరారు. ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగే సమ్మిట్‌కు రాష్ట్రం తరపున టాస్క్ ప్రాతినిధ్యం వహిస్తోందని తెలిపారు.

కొనసాగుతున్న రిలేనిరాహార దీక్షలు

ఘట్‌కేసర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 9వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలతోపాటు సోమవారం ఘట్‌కేసర్ బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో మధ్యాహ్నం వరకు కొందరు వ్యాపారులు దుకాణాలను మూసివేశారు. ఈ బంద్‌కు మిశ్రమ స్పందన లభించింది. జేఏసీ బంద్‌కు పిలుపునివ్వడంతో పాటు కాంగ్రెస్ నాయకుల వంతెన పర్యటన చేపట్టడంతో ఘట్‌కేసర్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మాల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి పర్యటించి బందోబస్తును పర్యవేక్షించారు. కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు చేయాలని సూచించడంతో ఆయన పనులు చేపడతామని చెప్పారు. అయినప్పటికీ దీక్షలు కొనసాగుతాయని నిర్వాహకులు స్పష్టం చేశారు.

ఆశా కార్యకర్తలపై పోలీసుల తీరు దుర్మార్గం

వికారాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా ఆందోళనచేస్తున్న ఆశావర్కర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వ్యవహరించిన తీరు దారుణంగా ఉందని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమోళ్ల కృష్ణయ్య, తెలంగాణ గ్రామీణ ఆరోగ్య (ఆశ) కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల, ప్రధాన కార్యదర్శి అనిత ఆరోపించారు. ఆమె సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు రోజే కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులు ఆడవాళ్లని కూడా చూడకుండా దుర్మార్గంగా వ్యవహరించారని, మహిళల పట్ల వెకిలిచేష్టలు చేస్తూ అసభ్యకరంగా వ్యవహరించారని ఆరోపించారు. పోలీసుల వైఖరి ఇదే విధంగా కొనసాగితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

పరిగి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి బయల్దేరిన మాజీ సర్పంచులను పరిగి పోలీసులు అరెస్ట్ చేశారు. వారందరినీ పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచుల నిరసనకు పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మాజీ ఎంపీపీ అరవింద్ రావు, నాయకులు సంఘీభావం తెలిపారు.

దోమ: సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల కోసం సోమవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్ కె.రాజీరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు.

మర్పల్లి: పెండింగ్ బిల్లుల కోసం ప్రశ్నిస్తే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరైంది కాదని బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు శ్రీను, అశోక్, మధు, రమేశ్ తదితరులు ఆరోపించారు.

ఘట్‌కేసర్ రూరల్: అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ఎదులాబాద్ ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం ఘట్‌కేసర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఉదయం 6గంటలకే పోలీసులు వాళ్ల ఇంటి వద్దకు వచ్చిన అదుపు లోకి తీసుకున్నారు. మధ్యాహ్నం వారిని సొంతపూచీకత్తుపై విడిచిపెట్టారు. అరెస్టయిన వారిలో జవ్వాజీ లింగంముదిరాజ్, చిర్ర బాలరత్నంముదిరాజ్, కందుల రామకృష్ణ, పూల నాగులు, ఈగల నాగులు ఉన్నారు.

డిజిటల్ జోష్

పెరుగుతున్న ఆన్‌లైన్ చెల్లింపులు



- భారీగా తగ్గిన నగదు లావాదేవీలు
- చిరు వ్యాపారులకు ప్రయోజనకరం
- ఆన్‌లైన్ పేమెంట్‌తో మోసాలకు చెక్

కొడంగల్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం డిజిటల్ పేమెంట్ల జోరు కొనసాగుతోంది. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా బ్యాంకులో నగదు, చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసే వెసులుబాటు ఉండటంతో ఆన్‌లైన్ చెల్లింపులపై ప్రజల ఆసక్తి పెరిగింది. పెద్ద షాపింగ్ మాల్స్ వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్స్ ఇప్పుడు వీధి వ్యాపారాల్లోకి కూడా వచ్చేసింది. చిరు వ్యాపారులు సైతం నగదు రహిత లావాదేవీలకు అలవాటుపడ్డారు. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ పేమెంట్సే కనిపిస్తున్నాయి. పట్టణాల నుంచి మారుమూల పల్లెల వరకు డిజిటల్ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చాయి.

పరిస్థితులకు అనుగుణంగా..

2016లో పెద్దనోట్లు(రూ. 500, రూ. 1000) రద్దుతో డిజిటల్ పేమెంట్లు మొదలయ్యాయి. అయితే అప్పట్లో ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. మాల్స్ పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే కార్డు ద్వారా డిజిటల్ లావాదేవీలు జరిగేవి. పట్టణాల్లో మాత్రమే అంతో ఇంతో ప్రాచుర్యం పొందినా గ్రామాల్లో డిజిటల్ పేమెంట్ల గురించి తెలియక భయపడేవారు అయితే కరోనా కారణంగా నగదు లావాదేవీలకు జనాలు భయపడ్డారు. అప్పటికే గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం ప్రాచుర్యం పొందడంతో చాలామంది నగదు రహిత లావాదేవీలు చేసేందుకు మొగ్గు చూపారు.

చిరువ్యాపారులు సైతం..

టీ స్టాళ్లు, కాకా హోటళ్లు, తోపుడు బండ్లు, సైకిళ్లపై రోడ్ల పక్కన, ఇంటింటికి తిరుగుతూ కూరగాయలు, పండ్లు వంటివి అమ్మే వ్యాపారులకు ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజనకరంగా మారాయి. చిల్లర సమస్యతో గతంలో బేరాలు పోయేవని ప్రస్తుతం అలాంటి సమస్య లేదని చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్పీకర్ బాక్సులతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటుగా ఆదమరిస్తే మోసాలకు గురయ్యే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరుకులు కొనుగోలు చేసిన తర్వాత వేరే ఖాతాకు నగదు బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారుడికి చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు స్పీకర్ బాక్సులు అందుబాటులోకి వచ్చాయి.

బ్యాంకుల్లో తగ్గిన నగదు లావాదేవీలు

బ్యాంకుల్లోనూ డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగదు లావాదేవీలు చాలావరకు తగ్గింది. అధికంగా క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్‌లు చేస్తు ఇంటి వద్ద నుంచి అన్ని రకాల సేవలు పొందుతున్నారు. ఫలితంగా బ్యాంకులకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులే అధికం

కిరాణా, ఫ్యాన్సీ, మందుల దుకాణం, పెట్రోల్ బంకులు, హోటళ్లు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జులు, కరెంటు బిల్లులు, గ్యాస్ బిల్ తదితర లావాదేవీలన్నీ మొబైల్ పేమెంట్ యాప్‌ల ద్వారానే సాగుతున్నాయి.

ఫోన్ ద్వారానే నగదు చెల్లిస్తున్నారు



వివిధ రకాల పండ్లను అమ్మడం ద్వారా నేను జీవనం కొనసాగిస్తున్నాను. కొడంగల్ ఇప్పుడు చాలా మంది పండ్లు కొనుగోలు చేసి గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారానే డబ్బులు చెల్లిస్తున్నారు. నగదు చెల్లించే వారు తక్కువ. గతం కంటే ఇటీవల కాలంలో ఫోన్‌పే, గూగుల్‌పే, పేమెంట్‌లు చెస్తున్న వారి సంఖ్య పెరింగింది. *- ఎండీ.నజీర్, పండ్ల వ్యాపారి, కొడంగల్*

ఇప్పుడు చిల్లర సమస్య లేదు



నగదు రహిత లావాదేవీలతో వ్యాపారం సులభంగా కొనసాగుతోంది. గతంలో చిల్లర సమస్య ఉండేది. ఇప్పుడు ఫోన్‌పే, గూగుల్‌పేతో చిల్లర సమస్య తీరింది. రిపేరింగ్ సెంటర్ కు వచ్చే వారందరు ఎక్కువగా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నా రు. *- సామ్య నాయక్, మొబైల్ రిపేరింగ్ సెంటర్, కొడంగల్*

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడిన ఓయువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, వెంకిర్యాల్‌కు చెందిన తంబాల నవీన్‌యాదవ్(25) నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గతనెల 30న రాత్రి 10.30గంటలకు తన స్నేహితుడు మెరుగు సాయిచరణ్‌తో కలిసి తన బైక్‌పై ఘట్‌కేసర్ నుంచి ఇంటికి వెళుతుండగా ఘట్‌కేసర్ అండర్‌పాస్ వద్ద ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్‌యాదవ్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గణేష్ విగ్రహాల తయారీ విషయంలో గొడవ

- కార్మికులకు తీవ్రగాయాలు

తాండూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గణేష్ విగ్రహాల తయారీ విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ జరగగా కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ వద్ద గత కొన్నేళ్లుగా గణేష్ విగ్రహాల తయారీ వ్యాపారం చేస్తున్న కొడంగల్‌కు చెందిన కొందరు వ్యక్తులు సర్వే నం.12లో ఐదేళ్ల కాలనీకి గానూ వెయ్యి గజాల స్థలాన్ని లీజుకు తీసుకొని షెడ్ నిర్మించారు. అయితే తాండూరు పట్టణానికి చెందిన కొంత మంది వ్యక్తులు షెడ్ వద్దకు వచ్చి ఇక్కడ వ్యాపారం చేయొద్దని షెడ్‌నిర్మించొద్దని కార్మికులను బెదిరించారు. అయినప్పటికీ షెడ్ నిర్మాణం చేపట్టడంతో శనివారం అర్ధరాత్రి సదరు వ్యక్తులు వచ్చి కార్మికులపై దాడిచేశారు. దాడుల్లో గాయపడిన వారిని స్థానికులు తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో ప్రస్తుతం వారు కోస్గిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడికి పాల్పడిన ఇందూర్ భరత్, ఇందూర్ వంశీ, ఇందూర్ నర్సింహులు, వడ్డె శ్రీనుతోపాటు గుర్తు తెలియని 10మంది తమపై దాడులు చేశారని విగ్రహతయారీ నిర్వాహకుడు బాల్‌రాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా, బాధితులు కొడంగల్ సీఎం నియోజకవర్గానికి చెందిన వారు కావడంతో సీఎం సోదరుడి వద్దకు తమకు జరిగిన దాడిపై వివరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా జాప్యం చేస్తున్నారని వాపోయారు. అయితే దాడుల వెనుక అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అండదండలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ గిరి తెలిపారు. ఇప్పటికే నలుగురిపై కేసులు నమోదు చేశామన్నారు.

కారుకు తృటిలో తప్పిన ప్రమాదం

బషీరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఫైబర్ నెట్‌వర్క్ గుంతలను ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తాజాగా సోమవారం బషీరాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన ఫైబర్ నెట్‌వర్క్ గుంత వద్ద బండరాయి కనిపించక కారు ఢీకొట్టింది. కారు డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్ వేయగా ముందు టైరు పగిలిపోయి నిలిచిపోయింది. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫైబర్ నెట్‌వర్క్ కాల్వల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

సోనియమ్మ దీవెనలతోనే ప్రజాపాలన



వికారాబాద్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు సంబురాలు

వికారాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ దీవెనలతోనే రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, కిషన్‌నాయక్, రాజశేఖర్, ముత్తహర్ షరీఫ్ పాల్గొన్నారు.

నవాబుపేట: నవాబుపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు సోమవారం సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి వెంకట్‌రెడ్డి, అనితారంగారెడ్డి పాల్గొన్నారు.

ధారూరు: సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా సోమవారం ధారూరులో కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్ పాల్గొన్నారు.

మర్పల్లి: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు.

పరిగి: సోనియాగాంధీ జన్మదిన వేడుకలను పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నివాసంలో సోమవారం పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ పాల్గొన్నారు.

పూడూరు: మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదినం పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. అనంతరం సోనియాగాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బొంరాస్‌పేట్: కాంగ్రెస్ జాతీయ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్‌రెడ్డి, కృష్ణ, నర్సింహులుగౌడ్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కీసర: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు కీసరలో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో సోమవారం కీసర ప్రధాన చౌరస్తాలోని అమర వీరుల స్తూపం వద్ద కేక్ కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

ఘట్‌కేసర్: సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ సోమవారం ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ పావని పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మండలంలోని వీరారెడ్డి విగ్రహం వద్ద సోమవారం కాంగ్రెస్‌పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

ఘట్‌కేసర్ రూరల్: సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఘనాపూర్‌లో బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పవర్‌గ్రిడ్ వద్ద సోనియాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల్ యాదవ్, రూప్‌సింగ్‌నాయక్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్: సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్

దోమ: మోత్కుర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చెన్‌రెడ్డి మురళిరెడ్డి సోమవారం సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులకు కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు యాదవరెడ్డి, శాంతకుమార్, మురళీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన



పరిగిలో కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పరిగి/నవాబుపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విజయ దీక్షా దివస్ సందర్భంగా పరిగిలో సోమవారం రాత్రి బీఆర్ఎస్ నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిగి మున్సిపల్ చైర్మన్ అశోక్, భాస్కర్, అరవింద్‌రావు, అరవింద్‌రావు, సురేందర్, ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా నవాబుపేట మండల కేంద్రంలోని తెలంగాణ ఉద్యమ అమరుడు ధవల్ గారి మహేందర్‌రెడ్డి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉద్యమ అమరుడు మహేందర్‌రెడ్డి తండ్రి చంద్రారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, సయ్యద్ గౌస్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బషీరాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్విచెడ్ ఘని పంచాయతీలో వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పూజారి రాములు ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజల కార్యక్రమాలు చేపట్టారు. వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, దుర్గప్ప, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు. మండలంలోని ఎక్మాయి బాలప్పస్వామిజీ (మఠం) ఆశ్రమంలో సోమవారం భక్తులు హనుమాన్ మాలధారణ చేపట్టారు. రామభక్తుడు, ఆశ్రమ పీఠాధిపతి శ్రీనివాస్‌స్వామిజీ ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వద్ద భక్తులు పలువురు మాలధారణ స్వీకరించారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

దోమ/నవాబుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం సీఎం కప్ క్రీడా పోటీలను సోమవారం ఎంపీడీవో మహేశ్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంజనేయులుగౌడ్, మల్లేశం, రాములు పాల్గొన్నారు. అదేవిధంగా నవాబుపేట మండల కేంద్రంలో సోమవారం సీఎం కప్ పోటీలను ఎంపీడీవో అనురాధ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీఎం కప్‌పోటీలు

బొంరాస్‌పేట్/మర్పల్లి: నేటి(మంగళవారం)నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకన్నగౌడ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలు నేటి(సోమవారం) నుంచి గురువారం వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజమల్లయ్య తెలిపారు. టీంల నమోదుకు 90003370702 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్రీడాపోటీలకు స్థల పరిశీలన

కులకచర్ల: ఈ నెల 11, 12వ తేదీల్లో జరిగే మండల స్థాయి ఓపెన్ టూ ఆల్ సీఎం క్రీడా పోటీల నిర్వాహణకు అధికారులు స్థల పరిశీలన చేశారు. ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ మురళీధర్, ఎంఈవో హబీబ్ అహ్మద్ సోమవారం మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గుకుల పాఠశాల క్రీడా స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీకాంత్‌రెడ్డి, పీడీలు సుభాష్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి సన్మానం

కులకచర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పీరంపల్లి గ్రామానికి చెందిన చింతకాయల జంగయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కులకచర్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు.

ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

మోమిన్‌పేట్, డిసెంబరు 9: సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఎంఈవో మల్లేశంకు సోమవారం సమ్మె నోటీసును అందజేశారు. మంగళవారం(నేడు) నుంచి సమస్యలను ప్రభుత్వ పరిష్కరించాలంటూ నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, బుచ్చయ్య, పద్మారావు, సుజాత, రత్నం, నగేశ్, జహంగీర్ పాల్గొన్నారు.

మారింది పాలకులు మాత్రమే పాలన కాదు



కాంగ్రెస్ గారడీల మేనిఫెస్టో విడుదల చేస్తున్న బీజేపీ నేతలు

వికారాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో మారింది పాలన కానీ పాలకులు కాదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వివేకానందారెడ్డిలు అన్నారు. బీజేపీ పిలుపు మేరకు సోమవారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల గారడీ 6 అబద్ధాలు 66 మోసాలపై మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలన పరంగా సంవత్సరం పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. వికారాబాద్ నియోజకవర్గంలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. రైల్వే ట్రాకుల వద్ద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు మాట మారుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు శిరీష, నాయకులు పాండు, రాజశేఖర్, శ్రీధర్‌రెడ్డి, బస్వరాజ్ , నరోత్తంరెడ్డి, యాదగిరి, రాజేందర్ రెడ్డి, వెంకట్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం



శామీర్‌పేట: పిల్లల తల్లులకు అవగాహన కల్పిస్తున్న శారద

శామీర్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు తల్లులు నిత్యం పౌష్టికాహారాన్ని అందిస్తే ఆరోగ్యంతో పాటు పెరుగుదల ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో శారద తెలిపారు. శామీర్‌పేటలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో మేడ్చల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్, అంగన్‌వాడీ సీడీపీవో శారద ఆధ్వర్యంలో సోమవారం ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాలను అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా నిర్వహించారు. విలేజ్ హెల్త్, శానిటేషన్, న్యూట్రీషన్ డేను పెద్దఎత్తున నిర్వహించారు. తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు అంగన్‌వాడీ చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, హెల్త్ పీహెచ్‌ఎన్ విజయకుమారి, అంగన్‌వాడీటీచర్లు నిర్మల, శకుంతల పాల్గొన్నారు.

కీసరగుట్టలో రుద్రహోమం

కీసర: దేవాదాయ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ప్రజాపాలన విజయోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రుద్రహోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో సుధాకర్ రెడ్డి అధ్వర్యంలో ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.

నస్కల్ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పరిగి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం నస్కల్ పంచాయితీలో నిధుల దుర్వినియోగం చేసిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పంచాయితీ కార్యదర్శి పారూక్‌హుస్సేన్ నిధుల దుర్వినియోగంపై వారం కిందట డీఎల్‌పీవో సంధారాణి జరిపిన విచారణలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు తేలినా ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నందివాగులో వ్యర్థ పదార్థాలు పడేసిన వారిని శిక్షించాలి

మోమిన్‌పేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లగూడుపల్లి శివారులోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ పరివాహక ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు వ్యర్థ పదార్థాలు, విషపూరిత నీటిని వాగులో పడేయడంతో నీళ్లు కలుషితం అవుతున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన బాలకృష్ణగౌడ్ తదితరులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ అరవింద్, రెవెన్యూ అధికారి గోవర్ధన్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని పరిశీలించారు.

నూతన కార్యవర్గం

కొడంగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం కొడంగల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి చంద్రకాంత్ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, మహిళా అధ్యక్షురాలిగా మహేశ్వరి, ఉపాధ్యాక్షుడిగా సేవ్యానాయక్, కోశాధికారిగా రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా అశోక్, రామకృష్ణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్, రాష్ట్ర సాహిత్య సభ్యులు మురహరినాథ్, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి దినేష్‌సింగ్, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అశోక్, చరణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

ఘట్‌కేసర్, డిసెంబరు 9: వీధికుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ నారపల్లిలో రూ.47లక్షలతో నిర్మించిన జంతుకుటుంబ నియంత్రణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిదిలోని ఆయా వార్డుల్లో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందన్నారు. సమస్య నివారణకు చర్యలు చేపట్టినట్లు గుర్తు చేశారు. ప్రధానంగా వీధికుక్కలకు కుటుంబ నియంత్రణ చేసి వాటి సంతానోత్పత్తికి అడ్డుకట్ట వేయనున్నట్లు వివరించారు. అయితే ఈ కేంద్రాన్ని మరోచోటుకు తరలించాలని స్థానిక మహిళలు ఆందోళనకు దిగారు. జనావాసాలకు దగ్గరగా ఈలాంటి కేంద్రాలు ఏర్పాటు చేయడం వలన దుర్వాసన వచ్చే ప్రమాదముందున వెంటనే కేంద్రంను మూసివేయాలని డిమాండ్ చేశారు. దాదాపు గంటపాటు స్థానిక మహిళలు ఆందోళన చేశారు. దీంతో చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు, పోలీసులు వారికి నచ్చజెప్పేప్రయత్నం చేసినప్పటికి వారు సేమీరా అనడంతో ఆందోళనల నడుమే ప్రారంభోత్సవం కొనసాగింది.



జంతు కుటుంబ నియంత్ర కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

సంక్షిప్తంగా..

యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

కులకచర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పరిగిలో జరిగే యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఎంఈవో హబీబ్ అహ్మద్ చేతుల మీదుగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

దోమ: ఈ నెల 14న పరిగి పట్టణంలోని కేఎఆర్ ఫంక్షన్ హాలులో జరిగే యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు కే.వాసురాం పిలుపునిచ్చారు.మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మహాసభ వాల్‌పోస్టర్‌ను ఎంఈవో వెంకట్, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కె.జంగయ్య, మేఘ్య, మల్లేశం పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకుంటే మేలు

కులకచర్ల: ప్రకృతిని కాపాడుకుంటే మనకు ఎంతో మేలు కలుగుతుందని మండలంలోని బండవెల్కిచర్ల బాలుర గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో జీవమిత్ర ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్‌రెడ్డి, జీవమిత్ర ఆర్గనైజేషన్ నిర్వాహకులు సాయిభరత్‌కుమార్, ఉత్తమ్‌కుమార్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా అనిల్‌కుమార్

తాండూరు: యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో తాండూరులోని నవాల్గకు చెందిన అనికుమార్‌గౌడ్ యువజన కాంగ్రెస్ వికారాబాద్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కచ్చి ఓవైస్

తాండూరు: తాండూరు నియోజకవర్గ సోషల్ మిడియా కోఆర్డినేటర్‌గా కచ్చి ఓవైస్‌ని నియమించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఓవైస్‌ను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సన్మానించి అభినందించారు. అభివృద్ధిపై ఎప్పటికప్పుడు విస్తృత ప్రచారం చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతిపక్షం నాయకుల తప్పుడు ప్రచారాలను ఖండించాలని ఓవైస్‌కు సూచించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కులకచర్ల: మండల పరిధిలోని సాల్విడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎం రాంచందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారిగా ప్రసన్నలక్ష్మి

వికారాబాద్: మండల వ్యవసాయాధికారిగా ప్రసన్నలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు.

ఆశావర్కర్స్‌పై దాడిని ఖండిస్తున్నాం

వికారాబాద్: ఆశ వర్కర్స్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోఠిలోని డీఎంఈ కార్యాలయం ముందు ఆశావర్కర్స్ తలపెట్టిన ఆందోళనలో పోలీసులు వారిని అరెస్ట్ చేయడం దారుణమన్నారు.

ఉచితంగా టీబీ వైద్య పరీక్షలు

బొంరాస్‌పేట్: కొడంగల్ నియోజకవర్గంలో మూడు రోజుల పాటు ఉచితంగా టీబీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో రవీందర్‌యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.మంగళవారం దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బుధవారం కొడంగల్ ప్రభుత్వాసుపత్రి, గురువారం బొంరాస్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

దోమ: మండలంలోని తిమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన రవి సోమవారం టై, బెల్టులను అందించారు. ఈ సందర్భంగా రవిని ఎంపీడీవో మహేశ్‌బాబు, ఎంఈవో వెంకట్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: మండలంలోని సోమన్‌గుర్తి అంగన్‌వాడీ కేంద్రం-1లో చిన్నారులకు సోమవారం యూనీఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.